క్లుప్తంగా

నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు


శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్నఅర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలో శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలు వీరభద్ర స్వామికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడు వీరభద్రుడికి, నందీశ్వరుడికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు నిర్వహించారు. లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజను చేశారు. అనంతరం నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానపెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

కుమారస్వామికి..


ప్రత్యేక పూజల అనంతరం కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

అలరించిన నృత్యప్రదర్శన


నృత్యప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన భవానీ విజయ్ వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన ప్రదర్శించారు. కార్యక్రమంలో విఘ్నరాజం, గణేశకౌత్వం, శ్రీచక్రరాజ, అర్ధనారీశ్వరం, లింగాష్టకం, రాజరాజేశ్వరి, శివతాండవం తదితర గీతాలకు దీక్షిత, వేదశ్రీ, భవాని, జాగృతి, శ్రావణి, అనురూప తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

దేవస్థాన సూపరింటెండెంట్ మృతి


మల్లిక్‌రాజా (ఫైల్)

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో సూపరింటెండెంట్ మల్లిక్ రాజా గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. ఉదయం గుండె నొప్పి అంటూ దేవస్థాన వైద్యశాలలో చేరారు. అపోలో వైద్యులు వైద్యచికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం జిల్లా వైద్యశాలకు రెఫర్ చేశారు. అక్కడికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

రాష్ట్ర ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం


డాక్టర్ పరిమళాదేవిని సన్మానిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: రాష్ట్ర ఉత్తమ అధ్యాపకురాలిగా అవార్డు అందుకున్న స్థానిక డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ పరిమళాదేవిని మంగళవారం కళాశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంగముని, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

పగిద్యాల: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లక్ష్మాపురం, ప్రాతకోట, ముచ్చుమర్రి ఫీడర్ల కింద బుధవారం సరఫరా అయ్యే వ్యవసాయ విద్యుత్ వేళల్లో స్వల్ప మార్పులు చేసినట్లు ఏఈ క్రాంతికుమార్ మంగళవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌లో కొత్త బ్రేకర్ ఏర్పాటు పనులు చేపట్టినందున ఉదయం 5 నుంచి 7.30 గంటల వరకు వ్యవసాయ మోటార్లకు కరెంట్ ఉంటుందన్నారు. 7.30 నుంచి 10.30 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని, మిగతా కరెంట్‌ను 10.30 గంటల అనంతరం కొనసాగిస్తామని ఏఈ వెల్లడించారు. మార్పును రైతులు గమనించాలని ఆయన కోరారు.

హోరెత్తిన అన్నదాతల పోరు

- రైతులకు సత్వరమే యూరియా అందించాలి
- వైఎస్సార్‌సీపీ శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు శిల్పా చక్రపాణిరెడ్డి, ధారా సుధీర్
- బైకు ర్యాలీకి తరలివచ్చిన రైతులు, పార్టీ శ్రేణులు


పార్టీ శ్రేణులు, రైతు సంఘం నాయకులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దారా సుధీర్

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆత్మకూరులో మంగళవారం నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులు భారీగా తరలివచ్చారు. తక్షణమే యూరియా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద బైక్ ర్యాలీని శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ కన్వీనర్ దారా సుధీర్ ప్రారంభించారు. కొత్త బస్టాండు, ఎంపీడీఓ కార్యాలయం మీదుగా ఆర్డీఓ కార్యాలయం సాగిన ర్యాలీలో శ్రీశైలం, బండిఆత్మకూరు, మహానంది, వెలుగోడు, నందికొట్కూరు, కొత్తపల్లి, పాములపాడు, జూపాడుబంగ్లా, పగిద్యాల, మిడుతూరు మండలాలకు చెందిన వందలాది మంది పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన నినాదాలతో పట్టణం హోరెత్తింది.

ఆర్డీఓకు వినతి పత్రం సమర్పించిన వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌లు

అన్నదాత పోరుతో ఆత్మకూరు పట్టణం దద్దరిల్లింది. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, రైతులు ఆర్డీఓ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో చేరుకుని యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు శిల్పా చక్రపాణిరెడ్డి, దారా సుధీర్ ఆర్డీఓ నాగజ్యోతికి వినతి పత్రాలు అందించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, జిల్లా, నియోజకవర్గాల పార్టీ నాయకులు సుజాతమ్మ, నాగార్జునరెడ్డి, జయకృష్ణ, సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఇంతియాజ్ ఆలీ, భాస్కర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి,పోచ జగదీశ్వర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి, గౌస్, అంజాద్‌ఆలీ, వెంకటస్వామి గౌడ్, విజయ్‌చౌదరి,విజయ్, మహబూబ్‌బాషా, రాజు, అబ్దుల్‌కలాం, సురేష్, సుల్తాన్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం

కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో ఘోరంగా విఫలమయ్యిందని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గా ఇన్‌చార్జులు శిల్పా చక్రపాణిరెడ్డి, దారా సుధీర్ విమర్శించారు. రైతులు యూరియా కోసం పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. తూతూ మంత్రంగా యూరియాను పంపిణీ చేస్తూ ఎక్కడా యూరియా కొరత లేదని చెప్పుకోవడం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. వర్షాలు కురుస్తుండటంతో పైర్లకు యూరియా చల్లుకోవాలనే ఆత్రుతతో అన్నదాతలు నిద్రహారాలు మాని రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా అధికారులకు, ప్రజాప్రతినిధులకు కనికరం లేదన్నారు. మరోవైపు పోలీసులు అత్యుత్సాహం చూపుతూ అక్కడక్కడా లాఠీచాలు చేస్తుండటం దుర్మార్గమన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులకు గిట్టుబాటు ధరతోపాటు రైతుభరోసా, సున్నావడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడీ అందించి రైతులకు అండగా నిలిచామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్దతు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. గతంలో క్వింటం పొగాకు రూ.14 వేల చొప్పున ఉన్న ధర.. కూటమి ప్రభుత్వంలో రూ.2 వేలకు పడిపోయిందన్నారు. క్వింటం కంది ధర రూ.10 వేల నుంచి రూ.4 వేలకు దిగజారినా రైతులకు మద్దతు ధర కల్పించకుండా కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రైతులకు సరిపడా యూరియాను అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

బండి ఆత్మకూరు నుంచి..

బండి ఆత్మకూరు: ఆత్మకూరులతో నిర్వహించిన అన్నదాత పోరు కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ బండి ఆత్మకూరు మండల అధ్యక్షుడు బారెడ్డి విజయభాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల రమణ, శ్రీశైలం నియోజకవర్గం అధ్యక్షుడు ఇటికెల చిన్న సుబ్బారెడ్డి, రైతు విభాగం మండల అధ్యక్షుడు పల్లె మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకట్రామిరెడ్డి, ఎంపీటీసీలు మధు తదితరులు తరలివెళ్లారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దారా సుధీర్

పగిద్యాల నుంచి..


ఆత్మకూరుకు బయలుదేరుతున్న రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పగిద్యాల: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆత్మకూరులో తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి మండలంలో నుంచి అభిమానులు భారీగా తరలి వెళ్లారు. పార్టీ మండల అధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున బయలుదేరి వెళ్లారు.

అన్నదాత పోరుకు తరలిన రైతులు


అన్నదాత పోరుకు బయల్దేరిని వైఎస్సార్‌సీపీ రైతు సంఘం నాయకులు

పాములపాడు: రైతన్నకు బాసటగా వైఎస్సార్‌సీపీ తలపెట్టిన అన్నదాత పోరుకు మండలం నుంచి రైతులు, రైతు సంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా ఆత్మకూరుకు తరలి వెళ్లారు. పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో ఎంపీటీసీ సురేష్, కో ఆప్టెడ్ సభ్యుడు ముర్తుజావలి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకులు క్రిష్ణారెడ్డి, బాలసుబ్బారెడ్డి, మహానందిరెడ్డి, రమణారెడ్డి, చలమారెడ్డి, రఘురామిరెడ్డి, క్రిష్ణారెడ్డి, జబ్బార్, ఓబన్నగౌడు, యుగంధర్‌రెడ్డి, అంబయ్య, ప్రభాకరరెడ్డి, గోపాల్, కోటినాయక్, రాముడు, మాలిక్, నాగశేషులు, వెంకటేశ్వరరెడ్డి, శేఖర్, ఉశేన్, మౌలా, పుల్లయ్య, దరగయ్య, రాజు, మహ్మద్‌గౌస్ తదితరులు తరలివెళ్లారు.

నందికొట్కూరు నుంచి..


ఆత్మకూరుకు బయల్దేరిన డాక్టర్ దారా సుధీర్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నందికొట్కూరు: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ఆత్మకూరులో చేపట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి పార్టీ నందికొట్కూరు ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్ ఆధ్వర్యంలో నాయకులు మన్సూర్, పుల్యాల నాగిరెడ్డి, శివనాగిరెడ్డి, నాగార్జునరెడ్డి, సురేష్ యాదవ్, లడ్డూ, తదితరులు తరలివెళ్లారు. దారా సుధీర్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా అతివృష్టి, అనావృష్టితో రైతన్నలకు కష్టాలు తప్పడం లేదన్నారు. గతేడాది నుంచి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల్లేక అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతన్నలకు యూరియా సరఫరా చేయకుండా వ్యవసాయాధికారులతో కూటమి నేతలు కుమ్మక్కై బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు రైతులకు యూరియా అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

జూపాడుబంగ్లా నుంచి..


అభిమానులతో ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద మండల అధ్యక్షులు పుల్యాల నాగిరెడ్డి

జూపాడుబంగ్లా: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆత్మకూరులో తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు పోచా జగదీశ్వర రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధులు కోసిక తిరుమలేశ్వరరెడ్డి, నాగార్జునరెడ్డి, మండల కన్వీనర్ తోకలకృష్ణారెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ వై.వెంకటరమణ, బీసీ సెల్ తాలూకా అధ్యక్షుడు విజయ్‌కుమార్, రైతువిభాగం మండల అధ్యక్షుడు వంగూరు సుధాకర్‌రెడ్డితోపాటు మరో 200 మంది రైతులు, పార్టీ కార్యకర్తలు తరలివెళ్లారు.

లింగనిర్ధారణ చేసే వారిపై చర్యలు తీసుకోండి

- ఆర్డీఓ నాగజ్యోతి


మాట్లాడుతున్న ఆర్డీఓ నాగజ్యోతి

ఆత్మకూరు: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ నాగజ్యోతి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్డీఓ ఆధ్వర్యంలో గర్భస్థ లింగ నిర్ధారణ చట్టంపై ఎస్డీఎల్‌ఎంఎంఏ డాక్టర్ కాంతారావు సమక్షంలో ఎస్‌డీఎల్‌ఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఆత్మకూరు డివిజన్ పరిధిలో ఆడపిల్లల శాతం తక్కువగా ఉన్నందున బాల్య వివాహాలు జరగకుండా చూడాలన్నారు. చెంచుగూడెం ప్రజలకు, విద్యార్థులకు చట్టం పట్ల అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీ చైర్మన్ డాక్టర్ కాంతారావునాయక్ మాట్లాడుతూ గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లు తెలిస్తే తమదృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కె.మద్దిలేటి, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ కల్లూరి పెద్ద మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

యూరియా మాఫియాను అరికట్టండి

ఆత్మకూరు: యూరియా మాఫియాను అరికట్టి, అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాలపై విజిలెన్స్ దాడులు నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్‌బాబు, ఆత్మకూరు తాలూకా కార్యదర్శి టి.ప్రతాప్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు ఇన్‌చార్జ్ ఏడీఏ హేమలతకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంతో పాటు పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో యూరియా మాఫియా జరుగుతోందన్నారు. రైతులకు అందాల్సిన యూరియాను పక్కదారి పట్టిస్తూ రూ.270 అమ్మాల్సిన యూరియా బస్తాను రూ.600కు రైతులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. వెంటనే విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో తాము పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ నాయకులు మహమ్మద్ హుసేన్, లల్లూ, పాములపాడు మండల నాయకులు అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ మంత్రి భారత పర్యటనను వ్యతిరేకించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నందికొట్కూరు: గాజాలో ఇజ్రాయిల్ మారణకాండను కొనసాగిస్తున్న నేపథ్యంలో ఆ దేశ ఆర్థిక శాఖ మంత్రి బెజాలేల్ స్మార్ట్ ట్రిక్ భారత్‌కు వస్తుండటాన్ని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నరసింహులు కోరారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయం నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాజాలో మారణకాండను కొనసాగిస్తున్న ఇజ్రాయిల్‌తో ద్వైపాక్షిక పెట్టుబడులు ఒప్పందం, స్వేచ్ఛ, వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి భారత్ ఆహ్వానించడం తగదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మజీద్ మియా, గోపాలు, రమణయ్యశెట్టి, ఎల్లనాయుడు, శేఖర్, ఆది, అశోక్, రాజు, సర్దార్, రాజేష్, దుబ్బన్న పాల్గొన్నారు.

హత్యకేసులో మరో ఇద్దరి అరెస్టు

కర్నూలు: నగరంలోని కొత్తపేటకు చెందిన బంగారు నగల తయారీదారుడు షేక్ ఇజహర్ అహ్మద్ (45) హత్యకేసులో మరో ఇద్దరు నిందితులు ఇమ్రాన్, యూసుఫ్‌లను ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. రెండు కుటుంబాల మధ్య గొడవల కారణంగా షేక్ ఇజహర్ అహ్మద్ ఈనెల 1వ తేదీన రాధాకృష్ణ థియేటర్ వద్ద ఉన్న మసీదు బయట హత్యకు గురయ్యాడు. హతుడి తండ్రి షేక్ గౌస్ నిసార్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఐదుగురు వ్యక్తులకు హత్యలో ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేల్చి ఇది వరకే ముగ్గురిని అరెస్టు చేశారు.

15న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్టేట్ లెవల్ ఖేలో ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 15న ఉదయం 7 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు సాయి సెంటర్ ఇన్‌చార్జ్ కార్తికేయన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2008 - 2013 మధ్య జన్మించిన క్రీడాకారులు అర్హులని తెలిపారు. గోల్ కీపర్ ఎత్తు, లెఫ్ట్ హ్యాండ్ క్రీడాకారుల ఎత్తు 175 సెంటీమీటర్లు ఉండాలని తెలిపారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డుతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, 10వ తరగతి మార్క్‌లిస్టు వెంట తీసుకురావాలని సూచించారు. వివరాలకు సెంటర్ ఇన్‌చార్జ్ 87547 29345ను సంప్రదించవచ్చన్నారు.

దొంగల అరెస్ట్

బేతంచెర్ల: మండలంలోని ముద్దవరం గ్రామంలో ఈ నెల 5,6వ తేదీల్లో జరిగిన బోరు మోటర్, రాగి వైరు దొంగతనానికి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామ రైతులు తిమ్మగురుడు, సుబ్బారెడ్డి ఫిర్యాదు మేరకు సీఐ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్‌ఐ రమేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం 6 గంటల సమయంలో నిందితులు బేతంచెర్లకు చెందిన నాగరాజు, ఫణిని సిమెంట్‌నగర్ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి దొంగిలించిన బోరు మోటర్, 100 మీటర్ల రాగి వైరు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను మంగళవారం డోన్ కోర్టుకు రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు.

మహిళ అదృశ్యం

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని కాకనూరు గ్రామానికి చెందిన సంధ్య (18) మంగళవారం అదృశ్యమైనట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు. సంధ్య ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె తండ్రి భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

కొత్తపల్లి: గుంతలు పడి ప్రయాణికులకు ఇబ్బందిగా మారిన ఆత్మకూరు - సంగమేశ్వరం రోడ్డుకు మరమ్మతులు చేయించాలని సీపీఎం మండల కార్యదర్శి ఎన్ స్వాములు ఆర్‌అండ్‌బీ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం ఎం.లింగాపురం, నందికుంట గ్రామాల వద్ద రోడ్డుపై పడిన గుంతలను పరిశీలించారు. నందికుంట నుంచి భారీ వాహనాలు హైవే నిర్మాణ పనులకు మట్టి తోలడం వల్ల రోడ్డు కుంగిపోయిందని, ప్రమాదాలు జరగకముందే మరమ్మతులు చేయించాలని ఆయన కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

కొత్తపల్లి: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన కొలనుభారతి క్షేత్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ రామలింగారెడ్డి మంగళవారం తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా 6 కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. అలాగే సిబ్బంది సమయపాలన పాటించేందుకు బయోమెట్రిక్ అథెంటికేషన్ హాజరును అమలు చేశామన్నారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుంతల పూడ్చివేతకు కొలతలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండల కేంద్రమైన సున్నిపెంటలో రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చడానికి మంగళవారం సచివాలయ సిబ్బంది కొలతలు తీసుకున్నారు. ప్రధాన రహదారులలో ఏర్పడిన రోడ్లపై గుంతల పరిమాణాలను నమోదు చేసుకున్నారు. బస్టాండ్ సెంటర్, అక్కమహాదేవి సెంటర్, పూర్ణానందస్వామి ఆశ్రమం, జి-టైపు గృహాలు, చేపల మార్కెట్, సులేమాన్ సెంటర్, స్టోర్ సెంటర్, పోస్టాఫీసు లైన్, కాకుల్ సెంటర్, జలవనరుల శాఖ పాత అతిథిగృహం వెనుక భాగం, వెస్టన్ కాలనీలోని పాలిటెక్నిక్ కళాశాల రోడ్డు, బి.సి. గురుకుల పాఠశాల రోడ్లలో ఏర్పడిన గుంతలను సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ రవి ఆధ్వర్యంలో కొలతలు వేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఏ కోడూరు గ్రామంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్ చేసి, ఆటోను సీజ్ చేశామని ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేయగా నంద్యాలలోని ఫరూక్ నగర్‌కు చెందిన గౌస్ బాషా ఏపీ 21టీటీ 9118 ఆటోలో 13 బస్తాల బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతడిపై కేసు నమోదుచేసి, ఆటోను సీజ్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ప్రతి రైతుకు యూరియా అందిస్తాం

మహానంది: రైతు సేవా కేంద్రాలతో పాటు ప్రైవేట్ ఎరువు, పురుగు మందుల దుకాణాల ద్వారా ప్రతి రైతుకు యూరియా అందిస్తామని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన వ్యవసాయ సిబ్బందితో కలిసి గాజులపల్లె గ్రామంలో రైతులతో యూరియా సమస్యపై అడిగి తెలుసుకున్నారు. యూరియాకు బదులు నానో యూరియా వాడటం వల్ల మరింత మంచి ఫలితం ఉంటుందని రైతులకు సూచించారు. ఈనెల 30లోపు పంట నమోదు చేయించుకోవాలన్నారు.

హిందూ సంప్రదాయాలను అలవర్చుకోవాలి


హిందూధర్మ సంప్రదాయాలను వివరిస్తున్న కీర్తిరాజదాసు

జూపాడుబంగ్లా: ప్రతి ఒక్కరూ సనాతన హిందూ ధర్మ సంప్రదాయాలను అలవర్చుకోవాలని ఇస్కాన ధర్మ ప్రచారకులు కీర్తిరాజదాసు, తిరుమల, తిరుపతి దేవస్థానాల హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు మల్లువెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం మండ్లెంలోని రుక్మిణీపాండురంగస్వామి ఆలయంలో హిందూధర్మ ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులు పాశ్చాత్య పోకడలకు పోయి హిందూధర్మ సంప్రదాయాలను విస్మరించటం తగదన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం అరగంటపాటు భగవద్గీత చదవటం అలవర్చుకోవాలన్నారు. దైవారాధనతో పాటు మానవతాదృక్పథంతో దానధర్మాలు, మానవసేవ, అన్నదాన కార్యక్రమాలు అలవర్చుకోవాలన్నారు. గోవును సంరక్షించుకోవటం వల్ల మానవజాతి అంతరించకుండా కాపాడుకున్నట్లవుతుందన్నారు. అనంతరం శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతల్లోని సారాంశాన్ని భక్తులకు వివరించారు.

పంట పొలాల్లో గ్రీన్‌కో సోలార్ పనులు తగదు


సోలార్ పనులు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస గౌడ్

నందికొట్కూరు: రైతుల అనుమతులు లేకుండా పంట పొలాల్లో గ్రీన్ కో కంపెనీ సోలార్ పనులు చేయడం తగదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మానపాటి శ్రీనివాస గౌడ్ అన్నారు. మంగళవారం మిడుతూరు మండలంలో జరుగుతున్న సోలార్ పనులనను ఆయన పరిశీలించారు. పట్టా భూముల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తూ అడ్డుచెప్పిన రైతులపై రౌడీషీటు ఓపెన్ చేయిస్తామని సోలార్ కంపెనీ వారు బెదిరిస్తున్నారని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. ఈసందర్భంగా శ్రీనివాస గౌడ్ మాట్లాడుతూ మిడుతూరు మండలంలోని నాగలూటి, పైపాలెం మాసాపేట గ్రామాలకు చెందిన సుమారు 1,200 ఎకరాల్లో రైతుల అనుమతులు లేకుండా పనులు జరుగుతున్నాయన్నారు. రైతుల భూములను లాక్కుని వారినే బెదిరించడం ఎంత వరకు సమంజసమన్నారు. రైతులను సమీకరించి న్యాయం జరిగే వరకు పోరాడుతూనే కోర్టులను ఆశ్రయిస్తామన్నారు.

పంటనమోదు చేయించుకోండి


రైతులకు సలహాలు, సూచనలిస్తున్న ఏఓ కృష్ణారెడ్డి

జూపాడుబంగ్లా: రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలను సత్వరమే ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండ్లెం, తంగడంచ గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులు సత్వరమే ఈక్రాప్‌బుకింగ్ చేయించుకుని, రైతుసేవా కేంద్రాల సిబ్బందితో పంటనష్టం ఫొటోలు తీయించుకుని పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. యూరియా సరఫరా తగ్గినందున ప్రత్యామ్నాయంగా నానో యూరియా, నానో డీఏపీలను వినియోగించుకోవాలన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డి గ్రామానికి చెందిన మంగలి కృష్ణమూర్తి (50) కనిపించడం లేదని అతని కుమారుడు శ్రీరాములు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మతి స్థిమితం లేని తన తండ్రి మూర్ఛవ్యాధితో బాధపడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. జూలై 31వ తేదీ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదన్నాడు. బంధువుల ఊర్లలో, ఇతర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదన్నాడు. శ్రీరాములు నుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఫొటోలో వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు ప్యాపిలి పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

శ్రీశైలంలో అనకాపల్లి యువతి



శ్రీశైలం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న మల్లిక

శ్రీశైలంటెంపుల్: అవసరానికి అప్పు తీసుకుని తిరిగి చెల్లించకపోవడంతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఇంటి నుంచి వెళ్లిపోయి శ్రీశైలంలో ప్రత్యక్షమైంది. అనుమానాస్పదంగా తిరుగుతున్న యువతిని గుర్తించిన పోలీసులు చేరదీసి విచారించి విషయం తెలుసుకుని స్వగ్రామానికి తిరిగి పంపించేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అనకాపల్లి జిల్లా చీపురపల్లి మండపం పరవాడ గ్రామానికి చెందిన తిట్టి మల్లికా ఇంటి సమీపంలోని తెలిసిన వ్యక్తికి రూ.80 వేలు అప్పుగా ఇచ్చింది. ఎన్నిసార్లు అడిగినా తిరిగి చెల్లించకపోవడంతో మనస్తాపానికి గురై ఇల్లు విడిచి వెళ్లిపోయింది. చివరికి శ్రీశైలం చేరుకుని ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్న మల్లికను శ్రీశైలం పోలీసులు గుర్తించి స్టేషన్‌కు తీసుకెళ్లారు. వివరాలు తెలుసుకుని వాళ్ల కుటుంబ సభ్యులకు, పరవాడ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించి మల్లికకు నచ్చజెప్పి తిరిగి గ్రామానికి పంపించేశారు.